రైతన్నా.. జర భద్రం

- పొంచిఉన్న విద్యుత్ ప్రమాదాలు
- పొలం పనుల్లో జాగ్రత్తలు పాటించండి
- అవగాహన కల్పిస్తే ప్రమాదాల నివారణ



కొత్తకోట రూరల్: వానాకాలంలో రైతులకు విద్యుత్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నందున బోరు బావులు, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారని, చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదముందని అధికారులు అంటున్నారు. ప్రతి ఏడాది రైతన్నలు వ్యవసాయ పనుల నిమిత్తం విద్యుత్ మోటర్ల దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ గురై మృతి చెందిన ఘటనలు చూస్తున్నాం. కాగా ఇటీవల రైతులు విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడ్డారు. పోలీసులు ఇటీవల రైతులకు విద్యుత్ మోటర్ల దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలతో తెలుపుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- విద్యుత్ మోటర్లు, స్టార్టర్ బోర్డులు నేలపై కాకుండా ఎత్తైన గద్దెలపై ఏర్పాటు చేసి వర్షపు నీటితో తడవకుండా చూసుకోవాలి.
- మోటర్లు పాడైతే సొంతంగా ప్రయత్నించకుండా మెకానిక్‌లతోనే మరమ్మతులు చేయించాలి.
- మోటర్లకు వాడే సర్వీస్‌వైర్లు నాణ్యమైనవి అయి ఉండాలి. వైర్లు దెబ్బతింటే ప్లాస్టర్ వేయాలి.
- సబ్‌మెర్సిబుల్ మోటర్ల వైర్లు తెగితే పైన ఉన్న పరికరాలకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లేదా మోటర్ స్టార్టర్ స్విచ్ ఆన్/ఆఫ్ చేయొద్దు. సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. వారు రాని పక్షంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

నష్టపరిహారం ఇలా..

విద్యుత్ ప్రమాదాలకు మూడు రకాలుగా నష్టపరిహారం అందిస్తుంది. తీగలు తెగిపడి మనుషులు లేదా పశువులు మరణిస్తే పరిహారం లభిస్తుంది. కానీ గాయాలకు చెల్లించదు. మనిషి మరణిస్తే రూ.5లక్షలు, పశువులు మృతి చెందితే రూ.40 వేలు, మేకలు, గొర్రెలు మృతి చెందితే రూ.8వేలు నష్టపరిహారాన్ని విద్యుత్‌శాఖ చెల్లిస్తోంది. నష్టపరిహారంకోసం మనుషులైతే ఘటనా స్థలంలో ఫొటోలు, పోలీసులకు ఇచ్చినఫిర్యాదు, శవపంచనామా పత్రాలను అధికారులకు అందజేయాలి. పశువులు చనిపోతే ఫొటోలతో పాటు వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం రిపోర్ట్ విద్యుత్‌శాఖ అధికారులకు అందజేయాలి.

జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో ప్రమాదాలకు గురికాకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్విచ్‌లను ఆన్/ఆఫ్ చేయొద్దు. సమస్యలు ఉంటే లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి. అధికలోడ్ ఉంటే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. తీగలు తెగిపడినా లేదా కిందకి వేలాడుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి మరమ్మతు పనులు చేయించుకోవాలి.

– శివశంకర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏడీ, కొత్తకోట

అవగాహన కల్పించాలి



ప్రతిఏడాది ఎక్కడో ఒక చోట రైతులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందుతున్న ఘటనలు చూస్తుంటాం. అవగాహన లోపం కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులతో పాటు పోలీసు వారు రైతులకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

– బోయవెంకటయ్య, రైతు, అమడబాకుల గ్రామం

క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



వనపర్తి రూరల్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన పలువురు బాధితులకు చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పెబ్బేరులో 7 వార్డుకు చెందిన మంగళిరాముడు రూ.10వేలు, మోతె హనుమంతు రూ.10 వేలు, మోతె జయమ్మకు రూ.15వేలు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాసులుగౌడ్, మార్కెట్ డైరెక్టర్ మోతె రాములు, శివ సాయితో కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్, సుధాకర్‌గౌడ్, మాణిక్‌ప్రభు, మిర్చి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీజవాన్ మృతి.. గ్రామస్తుల సంతాపం

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఆర్మీజవాన్ ఎండీ సిరాజుద్దీన్ (95) ఆదివారం మృతి చెందాడు. అతని మృతిపట్ల గ్రామస్తులు సంతాపం తెలిపి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. రెండో ప్రపంచ యుద్ధంలో పనిచేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోవడంతో కిరాయి ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు.

కుక్కల బెడదను అరికట్టండి



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామంలో కుక్కలు ఎక్కువగా సంచరిస్తుడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్నారులు. పుశువులు గొర్రెలు, మేకలకు ప్రమాదంఉందని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా శునకాలు రహదారులపై సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను గ్రామంలో సంచరించకుండా ఊరికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంధ విద్యార్థులకు అన్నదానం



ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన సామాజికవేత్త దేశాయి పద్మజారెడ్డి అంధ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం స్థానిక సమ్మిళిత ఫౌండేషన్‌లో ఉంటున్న విద్యార్థులను కలిసి వారికి కావల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ ఖాదర్, కబడ్డీ కోచ్ శ్రీనివాసులు, వెంకటరాములు, ఎల్లన్న, అరుణ్‌కుమార్, అంధ విద్యార్థులు ఉన్నారు.

నిత్యవసర సరుకులు అందజేత



కొత్తకోట: అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన పురష్కరించుకుని కొత్తకోట బీజేపీ యువమోర్చ నాయకులు జిల్లా కేంద్రంలోని చాముండేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు కిరాణ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో వనపర్తి యువమోర్చా నాయకుడు రాము, కిట్టు, ఇతర సభ్యులు ఉన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణకేంద్రంలో త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. దసరా పురస్కరించుకుని భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, జహంగీర్, అనిత, శాంత, శైలజ, జ్యోతి, శంకరమ్మ , ప్రమీల, మంజుల తదితరులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వనపర్తిటౌన్: ప్రత్యేక రాష్ట్రం కోసం కీలక పదవులను వదిలేసి నిజాయితీకి, నిరాడంబరతకు మారుపేరుగా నిలిచిన బడుగుల బాంధవుడు కొండాలక్ష్మణ్ బాపూజీ అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, కవి గిరిరాజాచారి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంఘం రాష్ట్ర నాయకుడు గంధం నాగరాజు, ప్రజాగాయకుడు బాలేమియా, దళిత నాయకుడు చింతకుంట కూర్మయ్య, ప్రముఖ న్యాయవాది ఉత్తరయ్య, బీజేపీ నాయకుడు రాము, వాల్మీకి సంఘం నాయకుడు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రకృతివనం



అమరచింతలోని రాజవళి దర్గా ప్రకృతి వనం

అమరచింత: పట్టణంలోని రాజావళి దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం విద్యుత్ కాంతులకు నోచుకోక రాత్రివేళ అంధకారంలో మగ్గుతున్నది. పురపాలిక ఆధ్వర్యంలో పట్టణంలో 1వ, 4వ, 5వ వార్డుల్లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాల్లో కేవలం 1వ వార్డులో ఉన్న ప్రకృతి వనం మాత్రమే కాస్తా పచ్చదనం, మొక్కలు, గడ్డితో ప్రజలను ఆకట్టుకుంటున్నది. కాగా సాయంత్రం అయ్యిందంటే చాలు సంచరించడానికి వీలులేకుండా పోతున్నది. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో పార్కులో విషసర్పాలు సంచరిస్తున్నాయి. పురపాలిక అధికారులు తక్షణమే స్పందించి స్పందించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



అచ్చుతాపురంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



కొత్తకోటలో రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

వనపర్తి రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో అమవాస్య ప్రత్యేక పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చుతాపురం, చిమనగుంట్లపల్లి గ్రామంలోని గుంటి పంచముఖి అంజనేయస్వామి, లక్ష్మీనర్సింహా ఆలయంతో పాటు పెబ్బేరు మండలంలోని పాతపల్లి చింతలకుంట ఆంజనేయస్వామి, పెబ్బేరు పట్టణంలోని మిట్ట అంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయాల దగ్గర భక్తులకు దాతలు అన్నప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్‌స్వామి, రమేష్‌శర్మ పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి గ్రామ సమీపంలో గుట్టల్లో వెలసిన ఉగ్రనర్సింహా ఆలయంలో అమావాస్య పూజలు భక్తులు నిర్వహించారు. సంగినేనిపల్లి, తూముకుంట, వల్లభాపురం, నాగర్లబండతాండ, వీపనగండ్ల గ్రామాల నుంచి పలువురు మహిళలు, యువకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటిలింగేశ్వరస్వామికి ఆరుద్ర పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో శ్రీ దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఏకరుద్రాభిషేకం నిర్వహించినట్లు నిర్వాహకులు శేఖరయ్య అన్నారు. నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో రుద్రహోమాన్ని నిర్వహించారు.

వీరభద్రస్వామి ఆలయంలో

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం దగ్గర ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది బాగాన రాయచూర్ జిల్లా చిక్కసూగూర్‌కు చెందిన శ్వేత శ్రీనివాసశెట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లరాంపురం ఘటనపై బీసీ కమిషన్ చొరవ చూపాలి

పాన్‌గల్: నిజామాబాద్ జిల్లాలోని తాళ్లరాంపురం గ్రామంలో గౌడ కులస్తులపై జరుగుతున్న దాడులపై బీసీ కమిషన్, మానవ హక్కుల సంఘం స్వచ్ఛందంగా చొరవ తీసుకొని విచారణ చేపట్టాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు బండారు రాజేష్‌గౌడ్, కొల్లాపూర్ నియోజకవర్గ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యుడు సత్తూరి రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాళ్ల రాంపురం గ్రామంలో అక్రమంగా ఈత వనాలను తొలగించిన గ్రామస్తులపై చర్యలు తీసుకోకుండా బాధిత గౌడ కులస్తులపైనే చర్యలు తీసుకునే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో ప్రసాద్‌గౌడ్, యుగంధర్‌గౌడ్, బాలగంగాధర్‌గౌడ్, రమేష్‌గౌడ్, రాజయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, ఆశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కుల జేఏసీ కన్వీనర్‌గా బాలసాగర్



వనపర్తిటౌన్: జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ కన్వీనర్‌గా చిలుక బాలసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ సభ్యులు బింగిరాము, కార్తీక్‌లు బాలసాగర్‌కు నియామకపత్రాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు బాలాసాగర్ మాట్లాడుతూ.. డా.విశారదన్ నాయకత్వంలో సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో మార్చ్ 31న, హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కుల రాజ్యాధికార సాధన జేఏసీ ఉద్భవించిందన్నారు. అనంతరం ఆయనను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు భోజరాజు, దస్తగిరి, వీరపాగ రామకృష్ణ, ఎల్లయ్య, ఎల్లస్వామి, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కొత్తకోట: పీఆర్‌టీయూ మండల కార్యాలయంలో వనపర్తి జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, స్వరూపరాణి, శ్రీనివాస్ గౌడ్, శేఖర్‌గౌడ్, నాగమణి, పర్వీన్ భాను, మండల ఉత్తమ ఉపాధ్యాయులు విజయ్ కుమార్, జోషిత, నీలోఫర్‌లను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరచంద్రశేఖర్, జిల్లా గజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యుడు జె. భక్తరాజు, జిల్లా బాధ్యులు సంబారి బాలరాజు, మండల అధ్యక్షుడు మిద్దె సత్యనారాయణ ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



అమరచింత రాంనగర్‌లో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో మహిళలు

ఆత్మకూర్: దేవిశరన్నవరాత్రుల సందర్భంగా ఆత్మకూర్ పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ ఆవరణలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి, బాలబ్రహ్మేశ్వరస్వామి, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి, వాల్మీకినగర్‌లో ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. సోమవారం ఉదయం మొదటిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిస్తారని, రెండోరోజు గాయత్రి దేవిగా, 3 వరోజు అన్నపూర్ణదేవిగా, 4 వరోజు కాత్యాయినీదేవిగా, 5 వరోజు మహాలక్ష్మిదేవిగా, 6వరోజ లలితాత్రిపురసుందరీదేవిగా, 7వరోజు మహాచండిదేవిగా, 8వరోజు సరస్వతిదేవిగా, 9వరోజు దుర్గాదేవిగా, 10వరోజు మహిషాసుర మర్ధినిగా, 11వరోజు రాజరాజేశ్వరిదేవిగా 11 రోజులపాటు వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తారని నిర్వహకులు తెలిపారు. ప్రతిరోజు బతుకమ్మ పూజలు, బొడ్డెమ్మలు, సహస్రకుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



ఆత్మకూర్‌లో బతుకమ్మతో వస్తున్న మహిళలు

ఎంగిలిపూల బతుకమ్మ

అమరచింత: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మహిళలు ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించారు. తెలిగింటి పూల పండుగను మహిళలు తొమ్మిది రోజుల పాటు తీరొక్కపూలతో బతుకమ్మను కొలుస్తు పూజలు నిర్వహిస్తుంటారు.

ప్రజల పక్షాన పోరాడేదే ఎర్రజెండా



వనపర్తిలో ఎర్ర జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



అమరచింతలో మాట్లాడుతున్న విజయరాములు

వనపర్తి రూరల్: అనగారిన ప్రజల న్యాయం కోసం పోరాడేదే ఎర్రజెండా అని సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ రమేష్ అన్నారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రం చండీఘర్‌లో సీపీఐ 25వ జాతీయ మహసభల ప్రారంభం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంఘీబావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కళావతమ్మ పాల్గొని ఎర్రజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణవేణి, గోపాలకృష్ణ, జయన్న, చిన్న కురుమయ్య, లక్ష్మీనారాయణ, శివ, వంశీ, శిరీష, శ్రీదేవి, భూమిక పాల్గొన్నా రు.

అమరచింత: దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు ప్రజాపోరాటాల్లో సీపీఐ పార్టీకి వందేళ్ల చరిత్ర ఉందని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడేశక్తిగా దేశంలో ఎదిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. పార్టీ 25వ జాతీయ మహాసభలకు సంఘీభావం తెలుపుతూ మండల కేంద్రంలో ఆదివారం పార్టీ పతాకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణకార్యదర్శి రవీందర్, భాస్కర్, శ్యాంసుందర్, ఎర్రన్న, కుతూబ్, కుమార్, ఇబ్రాయిల్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కరిస్తాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని బొల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో సీపీఐ 25వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారని అందులో ప్రజా పోరాటాలకు సంబంధించిన అంశాలను చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో రంజాన్‌అలీ, చలమారెడ్డి, కురుమయ్య, తిరుమలయ్య, రాము, ఎల్లయ్య, శివ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి గ్రామాల శివారు నుంచి ప్రతినిత్యం పగలు, రాత్రి అనే తేడా లేకుండా పరిసరా గ్రామాలకు, వనపర్తికి అక్రమ ఇసుక రవాణా అవుతున్నా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్యులు తమ ఇంటి అవసరాల నిమిత్తం ఇసుక, మట్టిని తీసుకెళ్తే పోలీసులు సవాలక్ష కారణాలు చెబుతూ అనుమతులు ఉన్నాయా అంటూ నిబంధనలు పెట్టి కేసులు చేస్తారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణా చేసేవారు పోలీసులకు మాముళ్లు ఇస్తుండటంతోనే అనుమతులు లేకపోయినా పట్టపగలు ఇసుక రవాణా చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బుసిరెడ్డిపల్లి-రాయినిపల్లి గ్రామాల మధ్య ఇసుకలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ (ఫైల్)

నిరాశ మిగిల్చిన ముందస్తు పూతలు



ఇటీవల మామిడితోటలకు వచ్చిన పూత



భారీ వర్షాలతో నల్లబారిన పూత

వీపనగండ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో మామిడితోటల్లో ముందస్తు పూతలు రావడంతో సంతోషించిన రైతుల్లో అధిక వర్షాలతో పూతలు రాలడంతో నిరాశే మిగిలింది. మామిడితోటల పెంపకంలో మండలం మొదటి స్థానంలో ఉండగా, దాదాపు 6వేల ఎకరాల్లో రైతులు మామిడితోటలను సాగు చేశారు. పలు గ్రామాల్లో మామిడితోటల్లో 30 శాతం పూతలు రావడంతో పలువురు రైతులు రూ.వేలు ఖర్చు చేసి క్రిమిసంహారక మందులను పిచికారి చేశారు. తీరా అధిక వర్షాలతో పూతలు నల్లబారి రాలిపోయాయని ఉద్యాన శాఖ అధికారులు తిరిగి పూతలు వచ్చేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని మామిడిరైతులు కోరుతున్నారు.

చెరువులకు జలకళ



సల్కెలాపురం ఉప్పరివాని చెరువు



వెంకటాంపల్లి రెడ్డి చెరువు

ఖిల్లాఘనపురం: మండలంలో ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో కుంటలు, చెరువులన్నీ నిండాయి. ఇటీవల నెల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొరాయి. అల్లమయాపల్లి, మలిక్మియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం, షాపురం, దొంతికుంట తండా, వెంకటాంపల్లి, ఆగారం, తిర్మలాయపల్లి, మల్కాపురం తదితర చాలా గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యాంలు నిండి మత్తడి దూకాయి.